# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

# ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 30 -01-2026 సమయం : 6.45 గంటలు

## ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు, చిత్తూరు జిల్లాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పర్యటిస్తారు.**
2. **తెలంగాణలో గాలి నాణ్యత మెరుగుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్లోని అనకాపల్లి జిల్లా వైభవం, సంస్కృతి చాటేలా "అనకాపల్లి ఉత్సవాల"ను నిర్వహిస్తున్నామని హోంమంత్రి వి.అనిత పేర్కొన్నారు.**
4. **స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆకాంక్షించారు.**

----------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు, చిత్తూరు జిల్లాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటిస్తారు. ఇందులో భాగంగా గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ మాతా శిశు కేంద్రంలో అవసరమైన వైద్య పరికరాలు, సామాగ్రి సహా ఇతర సౌకర్యాల కోసం 27 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ కార్యక్రమం అనంతరం చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లాలో ఆయన

సొంత నియోజకవర్గమైన కుప్పం వెళ్లనున్నారు. ఈ మధ్యాహ్నం నుంచి ఎల్లుండి వరకు కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం చేపట్టిన జాతీయ రహదారుల ప్రాజెక్టులు 2029 నాటికి పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారి ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరుకు రవాణా వ్యయాన్ని గణనీయంగా తగ్గించటమే లక్ష్యంగా రహదారి ప్రాజెక్టులు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని ఓడరేవులను జాతీయ రహదారులతో అనుసంధానించాలని సూచించారు.ప్రస్తుతం రెండు లేన్లుగా ఉన్న జాతీయ రహదారులను 4 లేన్లుగా, 6 లేన్లుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లో 2029 నాటికి 1.4 లక్షల కోట్ల జాతీయ రహదారుల పనులు పూర్తి చేసే లక్ష్యంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

-----------------------

దేశంలో ప్రాంతీయ వైమానిక అనుసంధానంతో సామాన్య ప్రజలకు విమాన ప్రయాణాన్ని సులభతరం చేశామని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో జరుగుతున్న "వింగ్స్ ఇండియా - 2026" కార్యక్రమంలో కేంద్ర మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

----------------------

ఆంధ్రప్రదేశ్ లోని అనకాపల్లి జిల్లా వైభవం, సంస్కృతి చాటేలా "అనకాపల్లి ఉత్సవాల"ను నిర్వహిస్తున్నామని హోంమంత్రి వి.అనిత తెలిపారు. అనకాపల్లిలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఉత్సవ ఏర్పాట్లను మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఉత్సవ

గీతాన్ని, గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, జిల్లాలో ఈ రోజు, రేపు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్తరాంధ్ర, సంస్కృతి సాంప్రదాయాన్ని ప్రతిబింబించేలా వివిధ కార్యక్రమాలు జరుగనున్నాయని మంత్రి వివరిస్తూ,

:: వాయిస్ :: 32 సెకన్లు

----------------------

తెలంగాణలో జలాశయాల పునరుద్ధరణ, సహజ వనరుల సంరక్షణ, గాలి నాణ్యత మెరుగుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో మానవ వనరుల అభివృద్ధి విభాగంలో "గాలి నాణ్యత సూచీ, నిర్వహణ" అనే అంశంపై హైదరాబాద్ లో నిన్న ఏర్పాటు చేసిన సదస్సులో ఉపముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వాయు కాలుష్యం నియంత్రణకు శాస్త్రీయ విధానాలను అనుసరిస్తున్నామన్నారు. గాలి నాణ్యత పర్యవేక్షణకు రాష్ట్రంలో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేశామని త్వరలో గాలి నాణ్యత డాష్ బోర్డులను ప్రారంభిస్తామని ఉపముఖ్యమంత్రి వివరించారు.

----------------------

స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆకాంక్షించారు. ఏలూరు జిల్లా నూజివీడులో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ -మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో మంత్రి నిన్న పాల్గొన్నారు. సహాయక సంఘాల ద్వారా మంజూరైన రుణాలతో ఆర్థికంగా ఎదిగి స్ఫూర్తిగా నిలిచిన మహిళలను మంత్రి సన్మానించి అభినందించారు. అనంతరం అయన మాట్లాడుతూ, మహిళా సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి మూలమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళా సంఘాలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

----------------------

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా దేశం యావత్తు ఘనంగా నివాళులర్పిస్తోంది. సత్యం, అహింస, శాంతి ఉత్తమ మార్గాలని దృఢంగా విశ్వసించి... ఆ సిద్ధాంతాలను ఆచరించి.... భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు మహాత్మగాంధి మరణించి ఈ రోజుతో 78 సంవత్సరాలు పూర్తయింది. గుజరాత్ రాష్ట్రంలోని పోర్ బందర్ లో జన్మించిన బాపూజీ తన జీవితాన్ని స్వాతంత్ర్య సాధనకోసమే అంకితం చేశారు. మహాత్మాగాంధీ నడిపిన అహింసా పోరాటం ఫలితంగానే 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్యం లభించింది. 1948 జనవరి 30న నాధూరామ్ గాడ్సే తుపాకి గుళ్ళకు నేలకొరిగిన మహాత్మాగాంధి జీవితం ప్రజల హృదయాలపై చెరగని ముద్రవేసింది. ప్రజలు మంచిని స్వీకరించి.. చెడును త్యజించాలని ఒకానొక సందర్భంలో మహాత్మాగాంధీ పిలుపునిస్తూ......

:: వాయిస్ :: 32 సెకన్లు

-----------------------

తెలంగాణలోని మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర మూడవ రోజుకు చేరుకుంది. మహా జాతరలో భాగంగా మేడారం సమీపంలోని చిలకలగుట్టపై కుంకుమ భరిణె రూపంలో కొలువైన సమ్మక్కను ఆదివాసీ పూజారులు గత రాత్రి 10 గంటలకు గద్దెపైకి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అమ్మవారి రాకకు గౌరవసూచకంగా ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ ఆధ్వర్యంలో గాలిలోకి కాల్పులు జరిపారు. అనంతరం భక్తులు అధికసంఖ్యలో చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క - సారలమ్మలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ రోజు దర్శించుకోనున్నారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

-----------------------

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 6 వేల కోట్ల

రూపాయల ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని చెప్పారు. వాటి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ హస్తకళలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో టాటా కమ్యూనిటీ ఇనిషియేటివ్స్ ట్రస్ట్ ప్రతినిధులతో మంత్రి నిన్న ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాంప్రదాయ కళాకారుల క్లస్టర్ల బలోపేతం, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, బ్రాండింగ్ మార్కెటింగ్ వంటి అంశాలపై చర్చించారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 3 నుంచి 5 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. రాత్రి సమయంలో చలి గాలుల తీవ్రత కొనసాగుతోంది. రానున్న రెండురోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. ఇక మన్యం ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో 10 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా... తెలంగాణాలో సంగారెడ్డి జిల్లాలోని కోహిర్లో 5.6 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =